క్లుప్తంగా

12న జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌పై అవగాహన

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని పురమందిరంలో ఈ నెల 12న జిల్లాలోని రైతులకు జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌల్ట్రీ సహా పశువుల విభాగంలో సుస్థిరాభివృద్ధి, పెరుగుదల సాధించడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌ను అమలు చేస్తోందని చెప్పారు. అందులో భాగంగా జీవాలు, కోళ్లు, పందులు, పశువుల పెంపకంపై జిల్లా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు, ఔత్సాహిక నిరుద్యోగులు హాజరుకావాలని కోరారు.

మహిళపై దాడి

• కేసు నమోదు

వెంకటాచలం : మండలంలోని కసుమూరు గ్రామానికి చెందిన రాపూరు అంకమ్మపై అదే గ్రామానికి చెందిన రమణమ్మ, పోలయ్య, పుట్టయ్య దాడి చేయడంపై వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కసుమూరు గ్రామానికి చెందిన ఎస్.రజితను ఆమె అత్త, మామలైన రమణమ్మ, పోలయ్య, మరిది పుట్టయ్య అదనపు కట్నం తీసుకురావాలని ఆదివారం రాత్రి గొడవకు దిగారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన తన అక్క, రాపూరు అంకమ్మకు ఫోన్ ద్వారా రజిత తెలియజేసింది. వెంటనే రజిత ఇంటికి అంకమ్మ చేరుకుని తన చెల్లెలితో ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించడంతో రమణమ్మ, పోలయ్య, పుట్టయ్య ముగ్గురూ కలిసి అంకమ్మపై దాడి చేశారు. దీంతో బాధితురాలు వెంకటాచలం పోలీసులుకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్‌కు ఎండీయూ ఆపరేటర్ల వినతి



మనుబోలు : గత కొంతకాలంగా సర్వర్ పనిచేయకపోవడంతో రేషన్ బియ్యం పంపిణీని ఆపేస్తున్నట్లు ఎండీయూ ఆపరేటర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శివకృష్ణయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వర్ 7.9.1 వెర్షన్ ప్రవేశపెట్టినప్పటి నుంచి సక్రమంగా పనిచేయడం లేదన్నారు. దీంతో రేషన్ బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతూ ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటోను ఢీకొన్న బైక్ : ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రులు అంకయ్య, సుబ్రహ్మణ్యం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు సమీపంలో అల్లంపాడు క్రాస్ రోడ్డు వద్ద 67వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న బైక్ ఎదురుగా ఆటోను ఢీకొన్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. బైక్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అనంతసాగరం మండలం అగ్రహానికి చెందిన అంకయ్య, సుబ్రహ్మణ్యంలకు కుడి కాళ్లు విరిగాయని స్థానికులు తెలిపారు. 108 వాహనానికి ఫోన్ చేయడంతో ఈఎంటీ షేక్ షిబ్బతుల్లా, పైలట్ ఎస్.శ్రీనివాసులు క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని నెల్లూరుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శౌర్య జాగరణ రథయాత్ర

ఉదయగిరి: విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఉదయగిరిలో శౌర్య జాగరణ రథయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి యనమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీఎస్పీ స్థాపించి ఆరు దశాబ్దాలు గడిచిందన్నారు. వచ్చే ఏడాది జనవరిలో అయోధ్యలో జరిగే విగ్రహ ప్రతిష్టపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

అనుమసముద్రంపేట: హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో గంధమహోత్సవం సందర్భంగా దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వక్ఫ్‌బోర్డు అధికారి హుస్సేన్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దర్గాకు గంధమహోత్సవం సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. అత్యవసర సమయంలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏఎస్‌పేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీ, వైద్య సిబ్బంది ఫణీంద్రరెడ్డి, యు శ్రీనివాసులు, రసూల్, ఏఎన్‌ఎంలు, ఆశ వలంటీర్లు పాల్గొన్నారు.

● సంధ్య పొద్దున బతుకు వేట



రోజంతా వెలుగులు పంచిన ప్రచండ భానుడు అలసి సొలసాడు..అరుణ కాంతులతో అస్తమించేందుకు పయనమయ్యాడు. చీకట్లు పరుచుకుంటున్నా ఓ జాలరి అలసిపోకుండా గంగమ్మ ఒడిలో తన బతుకు వేటను సాగిస్తూ కనిపించాడు. ఈ దృశ్యం నగరంలోని స్వర్ణాల చెరువులో సోమవారం కనువిందు చేసింది.
–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సింహపురి సాహిత్య భీష్ముడు అగస్త్యరెడ్డి

నెల్లూరు(బృందావనం): సింహపురికి సాహిత్యపరంగా ఎనలేని సేవలందించిన ప్రముఖ కవి, విమర్శకుడు, సమాజసేవకుడు, అడ్వొకేట్ అగస్త్యరెడ్డి వెంకురెడ్డి సింహపురి సాహిత్య భీష్ముడు అని పలువురు వక్తలు శ్లాఘించారు. పురమందిరంలో రావు బహదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి టౌన్ హాల్ ట్రస్ట్ బోర్డు, నెల్లూరు వర్ధమాన సమాజం, దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్, నెల్లూరు సంయుక్త ఆధ్వర్యంలో అగస్త్యరెడ్డి వెంకురెడ్డి సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. వెంకురెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ వెంకురెడ్డి ఐదు దశాబ్దాలకుపైగా సాహితీ సేవలు అందించడమే కాకుండా మూడు తరాలకు సాహితీవారధిగానూ నిలిచారని కొనియాడారు. టౌన్‌హాల్, వర్ధమాన సమాజానికి అధ్యక్షులుగానూ నిస్వార్థంగా సేవలు అందించారని స్మరించుకున్నారు. ఆయన సేవలను గుర్తించి కేంద్రం పద్మ అవార్డును అందజేయాలని కోరారు. అనంతరం పలువురు వెంకురెడ్డి జీవితవిశేషాలు, రచనలు, వాటి విశిష్టత, శైలిని వివరించారు. వీఆర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు, పద్యకవి మెట్టు రామచంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగుభాషకు ప్రత్యేకమైన అవధానాలను పలువురు ప్రముఖులతో నెల్లూరులో ప్రారంభించిన ఘనత వెంకురెడ్డికే దక్కుతుందన్నారు. ప్రముఖ కవి, పండితులు ఆలూరు శిరోమణిశర్మ మాట్లాడుతూ వెంకురెడ్డి రాసిన షాణ్మాతుర స్తవం (శతకం)మహాకవి తిక్కన పద్యాలను స్ఫురణకు తెస్తాయన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పొన్నాల రామసుబ్బారెడ్డి, లతీఫ్‌కుట్టి, చిరసాని కోటిరెడ్డి, చలంచర్ల భాస్కరరెడ్డి, బత్తిన సాయికుమార్‌రెడ్డి తదితరులు వెంకురెడ్డి సాహితీ, సామాజిక సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వెంకురెడ్డికి సింహపురి సాహిత్య భీష్ముడిగా బిరుదును ప్రదానం చేస్తున్నట్లు దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్ కార్యదర్శి బీ సురేంద్రనాథ్‌రెడ్డి సభికుల ఆమోదంతో హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. నగరంలోని ఒక పార్కుకు అగస్త్యరెడ్డి వెంకురెడ్డి పేరుపెట్టాలని తీర్మానం చేశారు. అగస్త్యరెడ్డి వెంకురెడ్డి కుటుంబసభ్యులు, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.



అగస్త్యరెడ్డి వెంకురెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుర ప్రముఖులు

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

నెల్లూరు(క్రైమ్): బాలాజీనగర్ స్టేషన్‌లో పనిచేస్తూ అకాల మరణం చెందిన కానిస్టేబుల్ ఆర్ పోలయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు సహచర (2013 బ్యాచ్) కానిస్టేబుళ్లు ముందుకొచ్చారు. తమవంతుగా రూ.1.08 లక్షలను సేకరించి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి చేతుల మీదుగా మృతుడి భార్య త్రివేణికి సోమవారం అందజేశారు. చేయూతనందించిన కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు. బాధిత కుటుంబానికి పోలీసుశాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, శాఖాపరంగా రావాల్సిన అన్నింటిని త్వరితగతిన అందజేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.



త్రివేణికి నగదును అందజేస్తున్న ఎస్పీ

నృసింహుని సేవలో స్టేట్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఉన్న శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని స్టేట్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ బబిత కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని శ్రీవారి, ఆదిలక్ష్మి అమ్మవారి సన్నిధిల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు.

తొలుత దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె వెంట జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వాణి ఉన్నారు.



వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశానికి హాజరైన నేతలు

నెల్లూరు రూరల్: విజయవాడలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల ఆత్మీయ సమావేశానికి నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి భారీగా ప్రతినిధులు తరలివెళ్లారు. నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సమావేశానికి హాజరయ్యారు.



రాష్ట్రస్థాయి పోటీలకు పల్లిపాడు విద్యార్థులు



ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు

ఇందుకూరుపేట : ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీల ఎంపికలు సోమవారం జరిగాయి. ఇందులో ఇందుకూరుపేట మండలం పల్లిపాడు పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్–14, అండర్–17 విభాగాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్–14 బాలికల విభాగంలో ఎస్.శ్రావ్య, ఎం.పల్లవి, పి.చైత్ర, అండర్–17 బాలికల విభాగంలో వి.హాసిని అండర్–14 బాలుర విభాగంలో ఎస్.సాయి చరణ్‌తేజ్, ఎల్.సుశాంత్ సాయి, ఎస్.శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం డి.జ్ఞానప్రసూన, ఫిజికల్ డైరెక్టర్ పి.లక్ష్మయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): తల్పగిరికాలనీలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తన సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33 కేవీ రంగనాథ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఐడీ విద్యుత్ ఫీడర్‌లో ముస్లిం శ్మశాన మైదానం వద్ద నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఇసుకడొంక, రంగనాయకులపేట, గొల్లవీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

13న ఉపాధ్యాయ పోస్టులకు ఇంటర్వ్యూలు

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని కొత్తూరు వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయంలోని రెండు కాంట్రాక్ట్ ఉపాధ్యాయ పోస్టులకు ఈ నెల 13న ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపల్ శంకరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు కేంద్రీయ విద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు సర్వేపల్లిలో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పర్యటిస్తారని మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గ్రామానికి చేరుకుని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తారని, అనంతరం జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తారన్నారు. గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలియజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు సీతాదేవి 19వ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం తెలిపారు. సీతారామస్వామి మందిరంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామస్వామి మందిర కమిటీ, వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అష్టలక్ష్మి వైభవం, లక్ష్మీహోమం, శ్రీలలితా సహస్రనామార్చన, శ్రీదేవి ఖడ్గమాల, సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకారం, అర్చన, హోమం, సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు కలశ పూజ, అవతారదేవి పూజ, విశేష హోమాలు, పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు ప్రతి రోజూ విశేషాలంకారాల్లో కొలువై భక్తులను కటాక్షిస్తారని తెలిపారు. మందిర కమిటీ కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, ప్రధానార్చకుడు బీ శ్రీనివాసదీక్షితులు, కల్యాణ మండప కమిటీ కార్యదర్శి అమరామోహన్‌రావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వండి

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ వికాస్‌మర్మత్ నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాల్లో కమిషనర్ పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్‌కు సమస్యలపై ఫోన్ చేసిన నగర ప్రజలతో నేరుగా మాట్లాడారు. అనంతరం నగర ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాలకు సంబంధించి వస్తున్న అభ్యర్థనలను విచారించి అర్హులందరికి గృహాలు కేటాయించాలని సూచించారు. సంబంధిత విభాగాల ఉన్నతాధికారుల అనుమతులతో స్పందన సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపిన తరువాతే అర్జీను మూసివేయాలని తెలిపారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

రోడ్డుపై విరిగిపడిన స్తంభం



వాహనం ఢీకొనడంతో రోడ్డుకు అడ్డుగా పడిన స్తంభం



నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కిసాన్‌నగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని నాల్గోమైలు ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో విద్యుత్ స్తంభం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహనాలు వెళ్లకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్ వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సాయంత్రం 5 గంటల సమయానికల్లా సిబ్బంది పడిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వైద్య సేవలందేలా చూడాలి

• ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : అనారోగ్యంతో ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా ఉచిత వైద్య సేవలందేలా వలంటీర్లు చూడాలని ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం–1 సచివాలయంలో వలంటీర్లతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంతటి అనారోగ్య సమస్యలకైనా వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యశిబిరంపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించి వైద్యసేవలను సద్వినియోగం చేసుకునేలా వలంటీర్‌లు చూడాలన్నారు. శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం వృద్ధులు, వైకల్యం కలిగిన వారిని ఇంటికి చేర్చే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్యాయంగా పలకరించి..వినతులు స్వీకరించి





కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి తమ సమస్యలను విన్నవించుకునేందుకు పలువురు వృద్ధులు, దివ్యాంగులు తరలివచ్చారు. వారిని కలెక్టరేట్ సిబ్బంది వీల్‌చైర్‌లో తిక్కన భవన్‌లోకి తీసుకురాగా డీపీఓ సుస్మితరెడ్డి అప్యాయంగా పలుకరించి వినతులు స్వీకరించారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు